Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం


Follow

పేజీలు 10

శుక్రవారం, సెప్టెంబరు 12, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## నేడు రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సి.పి.రాధాకృష్ణన్‌తో పదవీ ప్రమాణస్వీకారం చేయించనున్నారని అధికారులు తెలిపారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ అయిన ఆయన రాష్ట్రపతి భవన్‌లో ఉదయం 10 గంటలకు తదుపరి ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. 67 ఏళ్ల రాధాకృష్ణన్ మం గళవారం ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో గెలిచారు. ఆయన తన ప్రత్యర్థి బి.సుదర్శన్ రెడ్డిని 152 ఓట్ల తేడాతో ఓడించారన్నది తెలిసిన విషయమే.



## పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణ సహకారం

రైలు-రోడ్డు-పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేసేలా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి

ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు వరకు అలైన్‌మెంట్ తయారు చేశాం

ట్రిపుల్ ఆర్ చుట్టూరా 362 కిలోమీటర్ల మేర రింగ్‌రైల్ నిర్మాణం చేపట్టాలి

రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రయాణికులకు వేగవంతమైన, రైలు-రోడ్డు-పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేసేలా రైల్వే ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులను కోరారు. రాష్ట్రంలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలకు

(మిగతా 2వ పేజీలో)

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

మావోయిస్టు అగ్రనేత బాలకృష్ణ సహా 10 మంది మృతి

గరియాబండ్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు...

మృతుల్లో బాలకృష్ణ ఉన్నట్లు ప్రకటించిన పోలీసులు

ఆయనపై మొత్తం రూ.2 కోట్ల రివార్డు

ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబండ్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎదురుకాల్పుల్లో మొత్తం 10 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు గురువారం పోలీసులు ప్రకటించారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి మోడెం బాలకృష్ణ (60) ఉన్నట్లు ఓ అధికారి చెప్పారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండకు చెందిన బాలకృష్ణ అలియాస్ మనోజ్ అలియాస్ బాలన్న, అలియాస్ రామచందర్, అలియాస్ భాస్కర్‌పై మొత్తం రూ.2 కోట్ల రివార్డు ఉన్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హర్షం వ్యక్తం చేశారు. వచ్చే మార్చి 31లోగా నక్సలైట్ల ఏరివేత పూర్తి కావడం ఖాయమని పేర్కొన్నారు. మెయిన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. యాంటీ నక్సలైట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు కూంబింగ్ చేపడుతుండగా ఎన్‌కౌంటర్ జరిగినట్లు రాయిపూర్ రేంజ్ ఐజీపీ అమ్రేశ్ మిశ్రా తెలిపారు. ఛత్తీస్‌గఢ్ పోలీస్‌కు చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్, జిల్లా పోలీసు విభాగానికి చెందిన 'ఈ%-%30', సీఆర్‌పీఎఫ్‌కు చెందిన కోబ్రా దళాలు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాయని ఆయన చెప్పారు. సీనియర్ నేతలతో పాటు మొత్తం 10 మంది నక్సలైట్లు మృతి చెందారని, పూర్తి వివరాలు అందాల్సి ఉందని అన్నారు. బాలకృష్ణ మృతితో ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.

**హైదరాబాద్‌లో చదువుతూ ఉద్యమ బాట**

మోడెం వెంకటయ్య, మల్లమ్మ దంపతులకు బాలకృష్ణ



జన్మించారు. వెంకటయ్యకు పోస్టుమ్యాన్ ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌లోని చోర్‌ఘాట్ ఏరియాకు సుమారు 50 ఏళ్ల కిందటే మకాం మార్చారు. బాలకృష్ణకు ముగ్గురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. 1983లో

(మిగతా 2వ పేజీలో)



## అంగట్లో గ్రూప్-1 పోస్టులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాలి

మంత్రుల వసూళ్లపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టాలి

హైదరాబాద్: కాంగ్రెస్ మంత్రులు గ్రూప్-1 పోస్టులను అంగట్లో పెట్టి అమ్ముకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయంలో మంత్రులు, సీఎం కార్యాలయంపై వస్తున్న ఆరోపణలను నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కష్టపడి, తమ విలువైన సమయాన్ని, తల్లిదండ్రుల కష్టార్జితాన్ని వెచ్చించి పోటీ పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని గురువారం ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్-1 పరీక్షను అక్రమాలకు తావులేకుండా తాజా నోటిఫికేషన్ వేసి మళ్లీ నిర్వహించాలన్నారు. పరీక్షల్లో జరిగిన అవకతవకలపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి ఉద్యోగాలు అమ్ముకున్న దొంగలెవరో తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో పాటు

(మిగతా 2వ పేజీలో)




## రాజ్యాంగానికి కాపలాదారులం

గవర్నర్లు విధులు నిర్వర్తించడంలో విఫలమైతే మేము చూస్తూ కూర్చోవాలా?

ప్రశ్నించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం

రాష్ట్రపతి రిఫరెన్స్‌పై తీర్పు రిజర్వ్





## బీఆర్ఎస్‌లో ఉన్నాం..

యూటర్న్ తీసుకున్న తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేలు

## రాష్ట్రానికి పాలనా పక్షవాతం

దాదాపు 22 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

హైడ్రా కూల్చివేతలు.. సాధించిన ఫలితాలపై శ్వేతపత్రం ప్రకటించాలి

మీట్ ది ప్రెస్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



## దంచికొట్టిన వాన

రాష్ట్రంలో పలుప్రాంతాల్లో భారీ వర్షం

మెదక్‌లో అత్యధికంగా 17.6 సెం.మీ వర్షపాతం

హైదరాబాద్-విజయవాడ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



హైదరాబాద్ : రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వానలు దంచికొట్టాయి. హైదరాబాద్‌తోపాటు మెదక్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో భారీగా వర్షం కురిసింది. మెదక్‌లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకధాటిగా 3 గంటలపాటు కుండపోత వాన కురిసింది. దీంతో మెదక్ పట్టణం అతలాకుతలమైంది. జిల్లా కేంద్రంలో అత్యధికంగా 17.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రోడ్లన్నీ చెరువులను తలపించగా, పట్టణంలోని పలువురి ఇళ్లలోకి నీరు చేరింది. పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణం వర్షపు నీటితో నిండిపోవడంతో విద్యా ర్థులు అవస్థలు పడ్డారు. మెదక్ మండలంలోని పలు గ్రామాల్లో 13 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు

(మిగతా 2వ పేజీలో)



## బిల్లులు వస్తున్నాయా?

ఇందిరమ్మ లబ్ధిదారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి పొంగులేటి

ఇందిరమ్మ ఇళ్ల కాల్ సెంటర్ ప్రారంభం

టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5991

హైదరాబాద్: 'హలో... నేను గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మాట్లాడుతున్నా. మీకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు వచ్చిందా.. దానికి సంబంధించిన బిల్లులు వస్తున్నాయా.. ఇంటి శ్లాబ్ ఎక్కడి వరకు వచ్చింది..అధికారులు మీకు సహకరిస్తున్నారా' అంటూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి మాట్లాడారు. గురువారం

(మిగతా 2వ పేజీలో)

## మారిషస్‌కు రూ.6,004 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ

భారత ప్రభుత్వం ప్రకటన

ఇరుదేశాల ప్రధానులు మోదీ, నవీన్ చంద్ర భేటీ

ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ ఏడు ఒప్పందాలపై సంతకాలు



వారణాసి: మారిషస్‌కు 680 మిలియన్ డాలర్ల(రూ.6,004 కోట్లు) ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గూలామ్ గురువారం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో సమావేశమయ్యారు. భారత్- మారిషస్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా

(మిగతా 2వ పేజీలో)

# పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణ సహకారం

సంబంధించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షించారు. వివరాలు సీఎం మాటల్లోనే.... పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది. అవసరమైన నిధులను సమకూర్చటంతోపాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు ఉండాలి. దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలి. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసింది. దానికి అనుగుణంగా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి. రైల్వే విభాగ పరిశీలనలో ఉన్న అన్‌లైన్‌మెంట్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్‌మెంట్‌ను పరిశీలించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలి. హైవే వెంట రైలుమార్గం ఉండాలి, హైవేకు ఇరువైపులా కిలోమీటరన్నర దూరం వరకు ఇండ్రస్టియల్ కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయి. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్‌మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలి. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతోపాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలి. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలి. వికారాబాద్–కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలి. గద్వాల%–%డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా పనులు చేపట్టాలి. వరంగల్‌లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలి. భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలి. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తోపాటు వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలి'అని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.



**ఆర్ఆర్ఆర్ చుట్టూరా రీజనల్ రింగ్ రైల్**

హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైల్వే అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేస్తే.. హైదరాబాద్ మహానగర భవిష్యత్ స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండ్రస్టియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వేలైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రెటరీ వికాస్‌రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

# అంగట్లో గ్రూప్-1 పోస్టులు

ఆ పార్టీ నేతల కాసుల కక్కుర్తి వల్లే గ్రూప్–1 పరీక్షలో అవకతవకలు చోటు చేసుకున్నాయని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్నారు. ఏడాది లోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానాలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించాలని, కేవలం మాటలతో కాకుండా చేతల్లో చూపించి యువత ఆశలను నెరవేర్చాలని కేటీఆర్ సూచించారు.

**కేటీఆర్‌కు 'గ్రీన్ లీడర్‌షిప్'అవార్డు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికిగాను ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఆయన ఎంపికయ్యారు. ఈ నెల చివరిలో అమెరికాలోని న్యూయార్క్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. సెప్టెంబర్ 24న న్యూయార్క్‌లో జరగనున్న 9వ ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డు ప్రదానోత్సవం జరగనుంది.

నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం: హరీశ్‌రావు

హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అశోక్ నగర్ సెంట్రల్ లైబ్రరీతో పాటు ఇతర ప్రాంతాల్లో ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రూప్–1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని అన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్షలను సక్రమంగా నిర్వహించలేక విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోంది. డైవర్షన్ రాజకీయాలతో గ్రూప్–1 పరీక్షలో అవినీతి, అవకతవకలను కప్పిపుచ్చాలనే ప్రభుత్వ ఆటలు సాగవు. గ్రూప్–1 పరీక్షలో జరిగిన అక్రమాలపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను రెచ్చగొట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అసమర్థతను ఒప్పుకొని క్షమాపణ చెప్పాలి'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆకాంక్షలను నీరుగార్చి, వారి భవిష్యత్తుతో ఆటలాడుతోందని ఆయన విమర్శించారు.

**గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి**

చిక్కడపల్లి (హైదరాబాద్): గ్రూప్–1 పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగబాలు డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ముందు గ్రూప్–1 పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ అభ్యర్థులతో కలసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. దీంతో నిరసనలో పాల్గొన్న వారిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టుచేసి అబిడ్స్, ముషీరాబాద్ పోలీసుస్టేషన్లకు తరలించారు. గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్షల్లో జరిగిన అవకతవకలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలుగు మీడియం విద్యార్థులకు పేపర్ వాల్యుయేషన్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత నోటిఫికేషన్ రద్దు చేయాలని, తప్పుచేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుంగబాలు మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్షను నిర్వహించడంలో విఫలమైనందున, నైతిక బాధ్యత వహిస్తూ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రానికి పాలనా పక్షవాతం

**దాదాపు 22 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం**

**హైడ్రా కూల్చివేతలు.. సాధించిన ఫలితాలపై శ్వేతపత్రం ప్రకటించాలి**

**మీట్ ది ప్రెస్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు**



హైదరాబాద్: రాష్ట్రాన్ని పరిపాలనా పక్షవాతం (అడ్మినిస్ట్రేటివ్ పెరాలిసిస్) పట్టి పీడిస్తోందని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. దాదాపు 22 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని మండిపడ్డారు. రూరల్..అర్బన్ సెక్టార్లలోనే కాదు.. అన్ని సెక్టార్లలో కాంగ్రెస్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు కప్పర ప్రసాదరావు సమన్వయకర్తగా నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ఒక్క ప్రాజెక్టును కూడా సక్రమంగా ప్రారంభించలేదని, జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థ, భద్రతా చర్యల్లో విఫలమైందన్నారు. హైడ్రా చర్యల్లో భాగంగా ఎక్కడెక్కడ ఎవరెవరి ఆస్తులు కూల్చారు..సాధించిన ఫలితాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీగా ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతానికి పైగానే టికెట్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఫార్ములా ఈ–కార్ రేస్ అవకతవకలపై ఏసీబీ విచారణలో వెల్లడైన అంశాలను ప్రభుత్వం బయటపెట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా రూ.1,000 కోట్లు ఇచ్చేందుకు సిద్ధమని చెప్పారన్నారు. అయితే అందుకు పూర్తి విరుద్ధంగా ఓయూ ఉద్యోగులకు ఈసారి నెల జీతమే ఆలస్యంగా వచ్చిందన్నారు. జాబ్ కేలండర్ ప్రకటిస్తారు కానీ.. దానిని అమలు చేయడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో పేపర్ లీకేజీలు జరిగితే కాంగ్రెస్ హయాంలో 'హెూప్ బ్రేకేజ్'జరుగుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లపై కాకుండా నాణ్యత, అవినీతి, నిర్వహణ తదితర అంశాలు ముడిపడి ఉన్నందున మొత్తం ప్రాజెక్టుపైనే సీబీఐ విచారణ జరిపించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. వందరోజుల్లో ఎన్నికల హామీలు అమలు చేస్తామని చెప్పి..రెండేళ్లు కావొస్తున్నా ఏమీ చేయకపోవడంతో ప్రజలు ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# రాజ్యాంగానికి కాపలాదారులం

న్యూఢిల్లీ: రాజ్యాంగానికి తాము కాపలాదారులమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. గవర్నర్లు విధులు నిర్వర్తించడంలో విఫలమైతే తాము నిశ్శబ్దంగా చూస్తూ కూర్చోవాలా? అని ప్రశ్నించింది. పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల్లో ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలియజేసే విషయంలో రాష్ట్రపతి/గవర్నర్లకు గడువు నిర్దేశించే అధికారం న్యాయస్థానాలకు ఉందా? అనే అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనం తమ తీర్పును రిజర్వ్ చేసింది. ఈ వ్యవహారంపై 10 రోజులపాటు కొనసాగిన విచారణ గురువారం ముగిసింది. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, డీఎంకే ప్రభుత్వం మధ్య తలెత్తిన వివాదంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు పార్లమెంట్ లేదా శాసనసభల నుంచి వచ్చిన బిల్లులపై రాష్ట్రపతి/గవర్నర్లు మూడు నెలల్లోగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఈ ఏడాది ఏప్రిల్ 8న తీర్పు వెలువరించింది. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సందేహాలు లేవనెత్తారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఉన్న రాష్ట్రపతి/గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టులకు ఉందా? అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. కోర్టును ప్రశ్నించడానికి ఆర్టికల్ 143(1) కింద తనకున్న అధికారాలను వాడుకున్నారు. సుప్రీంకోర్టుకు మొత్తం 14 ప్రశ్నలు సంధించారు. బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 200, 201 కింద రాష్ట్రపతి/గవర్నర్లకు ఉన్న అధికారాలపై అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి రిఫరెన్స్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు 19వ తేదీన ప్రత్యేక విచారణ ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాల తరఫున సీనియర్ లాయర్లు వాదించారు. రాష్ట్రపతి రిఫరెన్స్‌ను విపక్ష పాలిత తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలు వ్యతిరేకించాయి. అసెంబ్లీలో ఆమోదించి పంపించిన బిల్లులపై రాష్ట్రపతి/గవర్నర్లు నిర్ణీత గడువులోగా సమ్మతి తెలియజేయడమో లేక వెనక్కి పంపించడమో జరగాల్సిందేనని పేర్కొన్నాయి. బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడం సరైంది కాదని స్పష్టంచేశాయి. రాష్ట్రపతి రిఫరెన్స్‌ను తిరస్కరించాలని ధర్మాసనాన్ని కోరాయి. కానీ, రాష్ట్రపతి అభ్యంతరాలను బీజేపీ పాలిత మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, గోవా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సమర్థించాయి. కేరళ, తమిళనాడు ప్రభుత్వాల తరఫున కె.కె.వేణుగోపాల్, కపిల్ సిబల్ సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు.

రాష్ట్రపతి అభ్యంతరాలను వ్యతిరేకించారు. ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పుతోపాటు గతంలో ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. గడువు నిర్దేశించే అధికారం కోర్టులకు ఉందని తేల్చిచెప్పారు. రాజ్యాంగం ప్రకారం.. వేర్వేరు వ్యవస్థలకు వేర్వేరు ప్రత్యేక అధికారాలు ఉంటాయని తుషార్ మెహతా గురువారం ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రపతి/గవర్నర్లకు రాజ్యాంగం ప్రత్యేక అధికారాలు ఇచ్చిందని, రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంలో అదొక భాగమని స్పష్టంచేశారు. గవర్నర్ల విచక్షణాధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని పేర్కొన్నారు. వారికి టైమ్‌లైన్ విధించే అధికారం కోర్టులకు లేదని స్పష్టంచేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ స్పందించారు. "రాజ్యాంగానికి మేము కాపలాదారులం. రాజ్యాంగం ప్రకారం వేర్వేరు వ్యవస్థలకు వేర్వేరు అధికారాలు ఉంటాయన్న విషయం నిజమే. న్యాయ వ్యవస్థ కూడా తనకున్న అధికారాలతో చురుగ్గా వ్యవహరిస్తోంది. అదేసమయంలో జ్యుడీషియల్ టెర్రరిజం, అడ్వెంచరిజం ఉండాలని మేము చెప్పడం లేదు. కానీ, ప్రజాస్వామ్యంలో ఒక వ్యవస్థ సక్రమంగా విధులు నిర్వర్తించడంలో విఫలమైతే రాజ్యాంగ కాపలాదార్లు నిష్క్రియాత్మకంగా ఉండిపోవాలా? అధికారాలు ఉపయోగించుకోకుండా చూస్తూ కూర్చోవాలా?"అని ప్రశ్నించారు. దీనిపై తుషార్ మెహతా బదులిచ్చారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

మావోయిస్టు (పీపుల్స్‌వార్) పార్టీ పట్ల ఆకర్షితుడైన బాలకృష్ణ.. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యను మధ్యలోనే వదిలేసి పోరుబాట పట్టారు. కొంతకాలం రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) జంట నగరాల బాధ్యతలు నిర్వర్తించిన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లారు. దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ఎదిగారు.

**1993లో అరెస్టు.. 1999 వరకు జైల్లో..**

పీపుల్స్‌వార్ పార్టీ పనిలో భాగంగా అడవినుంచి బయటకు వచ్చిన బాలకృష్ణను అప్పటి యాంటీ నక్సల్స్ స్క్వాడ్ (ఏఎన్ఎస్) పోలీసులు 1993లో అరెస్టు చేశారు. పోలీసు డీఐజీ కేఎస్ వ్యాస్ హత్య, ఎమ్మెల్యే కిడ్నాప్‌లతో పాటు బెంగళూరు ఆయుధాల స్వాధీనం, కుట్ర కేసులలో ఆయన సుమారు ఆరేళ్ల పాటు ముషీరాబాద్ జైల్లోనే ఉన్నారు. 1999లో బెయిల్‌పై విడుదలైన ఐదు రోజులకే కుటుంబసభ్యులు ఎంత బతిమిలాడినా వినకుండా తిరిగి అడవిబాట పట్టారు. సుమారు 26 సంవత్సరాలు ఏవోబీలో వివిధ కేడర్‌లలో పని చేశారు.ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల పోలీసులకు మోస్ట్‌వాంటెడ్‌గా మారారు. ఆయనపై మూడు రాష్ట్రాలతో పాటు ఎన్ఐఏ ప్రకటించిన దానితో కలిపి రూ.2 కోట్ల రివార్డు ఉన్నట్లు సమాచారం. ఆపరేషన్ కగార్ పేరిట గత కొంతకాలంగా ప్రత్యేక పోలీసు బలగాలు అడవులను జల్లెడ పడుతున్న సంగతి తెలిసిందే. ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఇతర నాయకులు, దళాలతో కలిసి బాలకృష్ణ ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దులో సంచరిస్తున్నట్లు కేంద్ర బలగాల నుంచి సమాచారం అందింది. ఈ మేరకు కూంబింగ్ చేపట్టగా ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది.

# దంచికొట్టిన వాన

వాతావరణశాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో ఉదయం ఎంతో ప్రశాంతంగా, ఆహ్లాదంగా కన్పించిన వాతావరణం మధ్యాహ్నం మూడు తర్వాత ఆకాశంలో ఒక్కసారిగా దట్టంగా మబ్బులు కమ్ముకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. హయత్‌నగర్‌లో 11.2 సెం.మీ., డిఫెన్స్ కాలనీ కమాన్ వద్ద 10.2 సెం.మీ, వర్షపాతం నమోదైంది. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపైకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రోడ్డుపై నాలుగు అడుగుల ఎత్తు మేర వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఎల్బీనగర్ నుంచి మెహిదీపట్నం వరకు ఉన్న ఇన్నర్ రింగ్‌రోడ్డు సహా ఇతర మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. వాగు దాటుతుండగా ఓ వ్యక్తి గల్లంతైన ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంగెంకలాన్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భుక్తంపల్లి మొగులప్ప(40) ఆవుల కాపరిగా పని చేస్తున్నాడు. గురువారం అతను ఊరి శివారులోని చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో వృథాగా పడేసిన టార్ఫాలిన్, ప్లాస్టిక్ కవర్ల కోసం దిడ్డివాగు దాటి వెళ్లాడు. ఎగువ ప్రాంతంలో కరిసిన వర్షానికి వరద ఉధృతమైంది. అవతలి ఒడ్డున ఉన్న గ్రామస్తులు వద్దని వారిస్తున్నా వినకుండా కవర్ల మూటను నెత్తిపై పెట్టుకుని వాగు దాటుతూ కొట్టుకుపోయాడు. అతని భార్య లలితమ్మ, ఇద్దరు కొడుకులు అక్కడికి చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. మొగులప్ప ఆచూకీ కోసం చేపట్టిన సహాయక చర్యలకు వర్షం ఆటంకం కలిగించింది. రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర సమీపంలో కొనసాగుతున్న ఉపరితల చక్రవాత ఆవర్తనం గురువారం కూడా కొనసాగింది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 4.5 కి.మీ. ఎత్తువరకు కొనసాగుతోంది. మరో ద్రోణి సబ్ హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కిం ప్రాంతం నుంచి జార?ండ్, దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల రెండు రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ వివరించింది. ప్రస్తుత నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు సగటున 64.05 సెం.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 78.52 సెం.మీ. నమోదైంది.

# బిల్లులు వస్తున్నాయా?

మంత్రి హైదరా బాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ కాల్ సెంటర్, హెల్ప్‌డెస్క్, ఇందిరమ్మ ఇళ్ల కాల్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో ఫోన్‌లో మాట్లాడారు. ముందుగా వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం లబ్ధిదారుతో మాట్లాడారు. 'బేస్‌మెంట్ వరకు మా ఇల్లు పూర్తయింది. కానీ ఇంకా బిల్లు రాలేదు'అని ఆమె చెప్పారు. దీనికి మంత్రి స్పందిస్తూ బేస్‌మెంట్ పూర్తయి ఎన్ని రోజులైంది, దాని ఫొటోలు అప్‌లోడ్ చేశారా అని అడిగారు. అప్పుడు అక్కడే ఆధార్ నంబర్‌తో అన్నీ పరిశీలించారు. రూ.లక్ష వచ్చే సోమవారం మీ బ్యాంక్ అకౌంట్‌లో పడతాయని పొంగులేటి చెప్పారు. మరో వ్యక్తి ఫోన్ చేసి గ్రేటర్ హైదరాబాద్‌లో ఎప్పుడు ఇళ్లు ఇస్తారని అడగ్గా, పొంగులేటి స్పందిస్తూ నగరంలో స్థల సమస్య ఉందని, త్వరలోనే పరిష్కారం కనుగొని అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ ఫోన్ 1800 599 5991 రోజూ ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తుందని మంత్రి పొంగులేటి అన్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడంతోపాటు వాటిని పరిష్కరించడంలో చొరవ చూపడానికి ఈ కాల్ సెంటర్ ను వినియోగించుకోవచ్చన్నారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సంబంధిఅగీత అధికారుల వద్దకు తీసుకెళ్లి చర్యలు తీసుకుని లబ్ధిదారులకూ ఆ వివరాలను తెలియచేస్తారని పొంగులేటి చెప్పారు. అవినీతికి ఆస్కారం లేకుండా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ పాల్గొన్నారు.

# మారిషస్‌కు రూ.6,004 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ

చర్చించారు. ఈ సందర్భంగా వి ద్య, ఇంధనం, హైడ్రోగ్రఫీ, అంతరిక్ష పరిశోధన వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా రెండు దేశాల మధ్య ఏడు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్, మారిషస్‌లు కేవలం భాగస్వామ్య పక్షాలు మా త్రమే కాదని.. అవి ఒకే కుటుంబమని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. స్వేచ్ఛాయుతమైన, సురక్షితమైన, స్థిరమైన, సౌభాగ్యవంతమైన హిందూ మహాసముద్రం ఇరుదేశాలకు ఉమ్మడి ప్రాధాన్యం కలిగిన అంశమని వివరించారు. నవీన్‌చంద్రతో భేటీ అనంతరం మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. మారిషస్ ప్రత్యేక ఆర్థిక మండలి భద్రతను బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందన్నారు. మారిషస్‌లో యూపీఐ చెల్లింపులు, రూపేకార్డులు అందుబాటులోకి వచ్చాయని, ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య వాణిజ్యం స్థానిక కరెన్సీల్లోనే జరి గేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కింద మారిషస్‌లో 10 ప్రాజెక్టులకు భారత్ సాయం అందించబోతోంది. ఇందులో ఓడరేవు, ఎయిర్‌పోర్టు, రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు ఉన్నాయి. ఇది ఆర్థిక సాయం కాదని.. రెండు దేశాల ఉమ్మడి భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడి అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత్, మారిషస్‌లు రెండు వేర్వేరు దేశాలు అయినప్పటికీ వాటి స్వప్నాలు, భవిష్యత్తు ఒక్కటేనని స్పష్టంచేశారు. చాగోస్ ఒప్పందం కుదిరినందుకు నవీన్ చంద్రతోపాటు మారిషస్ ప్రజలకు మోదీ అభినందనలు తెలిపారు. మారిషస్ సార్వభౌమత్వానికి ఇదొక చరిత్రాత్మక విజయమని ఉద్ఘాటించారు. మారిషస్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. మారిషస్ సార్వకచిమత్వాన్ని పూర్తిస్థాయిలో గుర్తించడానికి తమ మద్దతు కచ్చితంగా ఉంటుందని తెలిపారు. మారిషస్‌లో నూతన డైరెక్టరేట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ చెప్పారు.

# సువెన్ ఫార్మా యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలి

**కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలి..**

**సమస్యలని పరిష్కరించాలి...**

**పోరాటం ఉదృతం చేస్తాం...**

**హైదరాబాద్ హెడ్ ఆఫీస్ ముట్టడిస్తాం...**

**రెండు రోజుల దీక్షలను ప్రారంభించిన యూనియన్ అధ్యక్షులు కే రాజయ్య హెచ్చరిక..**



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఈరోజు పాశమైలారం లేని సెవెన్ ఫార్మా పరిశ్రమ వద్ద కార్మికుల సమస్యలపైన రెండు రోజుల నిరాహార దీక్షలను యూనియన్ అధ్యక్షులు కే రాజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువెన్ ఫార్మా లో గత 15 సంవత్సరాల నుంచి కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు, అందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు, కార్మిక చట్టాలకు విరుద్ధంగా యజమాన్యం వ్యవహరిస్తుందని, వెంటనే మొండి వైఖరి విడనాడాలనీ ఆయన హెచ్చరించారు, కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుందని ఆయన అన్నారు, పరిశ్రమ యజమానం పైన ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే మా పోరాట%శీ% పెద్ద ఎత్తున ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు, చట్టాల ప్రకారం కార్మికులను నేరుగా ఉత్పత్తిలో పని చేయించుకోరాదని, కోర్ డిపార్ట్మెంట్లో చేయించుకోరాదని చెప్తున్నప్పటికీ ఈ యజమాన్యం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుందని అన్నారు, పరిశ్రమలోని కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, లేకపోతే ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే బోనస్ చట్టప్రకారం 20% చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు ,ఈఎస్ఐ,పిఎఫ్, యూనిఫామ్, బూట్లు, ఉచిత క్యాంటీన్, ఉచిత ట్రాన్స్పోర్ట్ ,రెస్ట్ రూమ్, వాష్ రూమ్లో, తాగడానికి నీళ్లు అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు లేని పక్షంలో హైదరాబాదులోని హెడ్ ఆఫీస్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా కార్మిక చట్టాల పరిష్కారం కోసం అన్ని డిపార్ట్మెంట్లలో కేసులు వేస్తామని ఆయన హెచ్చరించారు, కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన అన్నారు, కార్మికుల పక్షాన నిరంతరం పోరాట సంఘం సీఐటీయూ అని అన్నారు.

ఈ దీక్షలో జిల్లా ఉపాధ్యక్షులు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ మాణిక్ మాట్లాడుతూ మేనేజ్మెంట్ మొండి వైఖరి విడనాడాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు, కార్మిక చట్టాలను ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు, కార్మికులంతా సంఘటితంగా పోరాడాలని కోరారు. ఈ దీక్షలలో కిర్బీ యూనియన్, పార్లే యూనియన్ ఇతర యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. తలారి శ్రీనివాస్ ,రాజు మద్దతు తెలిపారు, అలాగే పరిశ్రమ యూనియన్ నాయకులు జనరల్ సెక్రెటరీ వెంకటేష్, యూనియన్ నాయకులు చంద్రయ్య, అన్నాజీ, శ్రీనివాస్, చంద్రకాంత్, రాములు, సురేషు, ప్రభు, గంగమని తదితరులు పాల్గొన్నారు.



## బీరంగూడ పాఠశాల విద్యార్థులకు గీతంలో సాంకేతిక అవగాహన

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పాఠశాల విద్యార్థులలో విద్య, సాంకేతిక అవగాహనను ప్రోత్సహించడంలో భాగంగా, బీరంగూడలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం రెండు రోజుల చేరువయ్యే (ఔట్ రీచ్) కార్యక్రమాన్ని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సెప్టెంబర్ 10-11 తేదీలలో నిర్వహించింది. జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, భవిష్యత్తు ఆవిష్కరణల వైపు యువ మనస్సులను ప్రేరేపించడం లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ), ఐటీ టూల్స్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ లోని ప్రాథమిక భావనలను పరిచయం చేశారు. ఉద్భవిస్తున్న సాంకేతికతలపై ఆచరణాత్మక అవగాహన కల్పించారు. బీరంగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుల్లాభొట్ల వసంత అభ్యర్థన మేరకు, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ %-% కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.ఆర్.శాస్త్రి ఆమోదం, పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది పిల్లల భవిష్యత్ విద్యా ప్రయాణానికి అధునాతన జ్ఞానం, ప్రేరణను పొందేలా చేసింది. ఈ కార్యక్రమాన్ని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.నవీన్ కుమార్ సమన్వయం చేశారు.

## బౌలింగ్ మిషన్ కిడ్స్ జోన్ ప్రారంభించిన ఉప్పల్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్‌లోని గణేష్‌నగర్‌లో బౌలింగ్ మిషన్ కిడ్స్ జోన్‌ను కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కాలనీలోని అపురూప హైట్స్ సమీపంలోని ఎడిఫై స్కూల్ ప్రాంగణంలో బౌలింగ్ మిషన్ కిడ్స్ జోన్‌ను ఏర్పాటు చేశారు.బౌలింగ్ మిషన్ కిడ్స్ జోన్ ప్రారంభోత్సవానికి ఉప్పల్ కార్పొరేట్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రోపరేటర్స్ చైతన్య మురళి అమూల్య, సల్ల ప్రభాకర్ రెడ్డి,విజయేందర్ రెడ్డి, శ్రీనివాస్,ప్రశాంత్ రెడ్డి వివిధ స్కూల్లో కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

## నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**అధికారులు.. కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేయాలి..**

**పనుల్లో నాణ్యత లోపిస్తే అధికారులు..ఏజెన్సీలపై కఠిన చర్యలు.**

**పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం**



పటాన్చెరు : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని.. నిర్దేశించిన లక్ష్యం లోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లతో భారతి నగర్, పటాన్చెరు, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు డివిజన్లో పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ప్రధానంగా సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రహరీ గోడలు, స్మశాన వాటికలో అభివృద్ధి పనులు, సామాజిక ఫంక్షన్ హాళ్లు, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ.. పలు అభివృద్ధి పనుల్లో వేగం మందగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు కాంట్రాక్టర్లు సమన్వయం చేసుకుంటేనే సత్ఫలితాలు సాధిస్తామని సూచించారు. నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తిచేస్తేనే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియాలంటే నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. నిధుల విడుదల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే ప్రభుత్వంతో చర్చించి వెంటనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దు అని.. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోతే సంబంధిత ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు అధికారులు సైతం కఠిన చర్యలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికలు అందిస్తే ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, ఏఈలు శివకుమార్, ఫైజన్, దివ్య తేజ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు..

# అమీన్పూర్ పోలీస్ స్టేషన్ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డుల పరిశీలన.., ప్రతి ధరఖాస్తును ఆన్లైన్‌లో నమోదు చేయాలి..**

**డైల్ 100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలి.**

**ఆస్థి సంబంధిత నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్ లుగా గుర్తించి, నిఘా కట్టుదిట్టం చేయాలి..**

**ఆన్లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ ఆప్స్ మోసాల గురించి, ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.**

**నేరాల నియంత్రణ, నేర చేదనలో ఉపయోగపడే సిసికెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి.**

**ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.**



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : అమీన్పూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల మెయింటెనెన్స్ ను పరిశీలించారు. అనంతరం అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, స్టేషన్ రికార్డ్లను తనిఖీ చేస్తూ.., లాంగ్ పెండింగ్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని సూచించారు. అధిక ఆస్థి సంబంధిత నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్ లు గా గుర్తించి నిఘా కట్టుదిట్టం చేయాలని అన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. సిబ్బంది ప్రతిఒక్కరూ అన్ని వర్టికల్ విభాగాలలో ప్రావీణ్యత కలిగి ఉండాలని, ఎవరికి కేటాయించిన పనిని వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే వర్టికల్ విభాగంలో ముందుకు వెళ్లగళం అని అన్నారు. సిటిజన్స్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్ పోలీస్ స్టేషన్ కు వచ్చిన వారికి కనిపించే విధంగా ఉంచాలని అన్నారు. అదేవిధంగా పోలీసు స్టేషన్ కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని వారిసమస్యను ఓపికగా విని సత్వర న్యాయానికి కృషి చేయాలని సూచించడం జరిగింది.

యువత అత్యాశతో ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ.. సైబర్ మోసగాళ్ళు పన్నిన వలలో చిక్కి డబ్బుతో పాటు తనువు చాలిస్తున్నారని, సైబర్ నేరాలు జిల్లాలో అధికంగా పటాన్ చెర్వు, అమీన్పూర్ ప్రాంతాలలో జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు, కళాశాలలో మరియు సోషల్ మీడియా ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించడం జరిగింది. ముఖ్యంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఉద్యోగుల తాకిడి, స్కూల్స్, కళాశాల బస్సుల వలన అధిక ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని, దీనిని అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించడం జరిగింది.

నేరాల నియంత్రణలో, జరిగిన నేరాలను చేదించడానికి కీలకంగా ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకొనే విధంగా చూడాలని అన్నారు. ముఖ్యంగా షాపింగ్ మాల్స్ , షాప్స్, పెట్రోల్ పంపులు లలో సిసి కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. ఈ విజిటింగ్ లో పటాన్ చెర్వ్ డీఎస్పీ ప్రభాకర్, అమీన్పూర్ ఇన్స్పెక్టర్ నరేష్, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.



## దుర్గానగర్ కాలనీలో పార్కు కేటాయింపుకు బీజేపీ నేతల వినతి పత్రం

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : అమీన్‌పూర్ మున్సిపాలిటీ ,దుర్గానగర్ కాలనీలో పార్కు కేటాయింపుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ అమీన్‌పూర్ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో, దుర్గానగర్ వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీ వాసులు మరియు బీజేపీ నాయకులు కలిసి గురువారం మండల రెవెన్యూ అధికారి (MRO) మరియు అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ ను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, గతంలో అప్పటి MRO గుర్తించిన 164 సర్వే నంబర్ తో పాటు, ఆక్రమించబడిన సర్వే నంబర్లలోని ఖాళీ స్థలాలను పార్కు కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. దుర్గానగర్ కాలనీలో అసలు లేఅవుట్ ప్రకారం పార్కుల కోసం స్థలం ఉన్నప్పటికీ, అవి ఆక్రమించబడటంతో ప్రస్తుతం సుమారు 4,000 మంది వాసులుఅందులో వందలాది మంది పిల్లలుపార్కు సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ఖాళీ భూములను సంరక్షించడం అత్యవసరమని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాలనీ సభ్యులు కూడా ఆక్రమణలను తొలగించి త్వరలోనే పార్కు అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు రాజేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ నల్లగోని, నాయకులు గోరకడి శ్రీకాంత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శాంతి దేవి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మెహర్ ప్రసాద్, కాలనీ సభ్యులు మరియు బీజేపీ నాయకులు రాకేష్ సముద్రాల, నాగేంద్ర, రాకేష్ కల్వకుంట్ల, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు

**193 రోజులకు వచ్చిన ఆదాయం10,25,254 రూపాయలు.**

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : అమిన్ పూర్ మున్సిపాలిటీ బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం ఆలయచైర్మన్ సుధాకార్ యాదవ్, ఆలయ ఈవో శశిధర్ గుప్త,జిల్లా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు సమక్షంలో భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు, 193 రోజుల తర్వాత ఆలయంలో జరిగిన హుండీ లెక్కింపులో రూ. 10,25,254/- ఆదాయం వచ్చిందిఅని దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు మరియు చైర్మన్ సుధాకర్ యాదవ్, ఈవో శశిధర్ గుప్తా ఇరువురు మీడియా సమక్షంలో అన్నారు, ఆంధ్రప్రదేశ్ లో ఉన్న శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కి ఎంత పేరు ఉన్నదో తెలంగాణ రాష్ట్రంలో బీరంగూడగుట్ట శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కి అంతే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దేవాలయము, వేల సంవత్సరాల క్రితం స్వయంభుగా వెలసిన ఈ పరమశివుడు భక్తులకు కొంగు బంగారమే కోరిన కోరికలు తీరుస్తూ నిత్యం అభిషేకాలు అందుకుంటున్న భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం, శివరాత్రికి జరిగే బ్రహ్మోత్సవాలకు, శ్రావణమాసంలో జరిగే పూజలకు, కార్తీక మాసంలో జరిగే శివ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అవుతారు, ఆ పరవశం ఆశీర్వాదం మనందరి పైన ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్,ఈవో శశిధర్, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ ,అలయ ధర్మకర్తల మండలి సభ్యులు దండు రమేష్, మహేష్ కుమార్, ఎల్లయ్య, మల్లేష్, దీపక్ గౌడ్‌తో పాటు దేవదాయ శాఖ అధికారులు, సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## మంజీరా నీటి సరఫరా" సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కి వినతి పత్రం

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 11( వాయిస్ టుడే): 131 - కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేజ్ - 2 సంక్షేమ సంఘం సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కలిసి కాలనీలోని పలు వీధుల్లో "మంజీరా నీటి సరఫరా" సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంజీరా పైప్ లైన్ మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఫోన్ ద్వారా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సూర్య ప్రభ, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు %ఒ% కాలనీ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, రమణా రెడ్డి, కాలనీ వాసులు శ్రీనివాస్, సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

## సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చేరు : సిపిఎం పార్టీ పటాన్చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వార్షికోత్సవ సభను పటాన్చెరులోని ఐలా భవన్లో సిపిఎం పటాన్చెరు ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు గారు మాట్లాడుతూ 1946 నుండి 1951 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిందని గుర్తు చేశారు. నైజం, రజాకార్లు, జాగిర్దారులు, జమీందారులకు వ్యతిరేకంగా ఆనాడు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుండు విముక్తి చేయాలని మహత్తరమైన పోరాటం జరిగిందని గుర్తు చేశారు. ఈ మహత్తరమైన పోరాటంలో నైజాం ప్రభువుకు వ్యతిరేకమైన పోరాటంలో నాలుగువేల మంది ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరుగుతున్న క్రమంలో నైజాం రాజుకు వ్యతిరేకంగా బండి ఎనక బండి గట్టి 16 బండ్లు గట్టి అన్న పాటతో ప్రజానీకాన్ని ఉరుతలిగించి, అధికారాన్ని దూరం చేసిన చరిత్ర కమ్యూనిస్టుల అదే అని అన్నారు. దున్నేవాడికే భూమి అని నినాదం ఆనాడు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వనా అనేక పోరాటాలు చేసి 10 లక్షల ఎకరాల భూములను తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా పంచడం జరిగిందని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య గారి నాయకత్వాన తెలంగాణ సాయుధ రైతంగ పోరాటం జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం జరుగుతున్న క్రమంలో దొడ్డి కొమరయ్య, వీరనారి చాకలి ఐలమ్మ , బందంగి జాగీర్దార్లకు ప్రజాకారులకు జరిగిన పోరాటంలో అమరులు అయ్యారని అన్నారు. అనేకమంది మహిళలను తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అణచివేశారని అన్నారు. ఈ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కానీ ప్రస్తుత పాలకులు చరిత్రను వక్రీకరిస్తున్నారు అని గుర్తు చేశారు. సెప్టెంబర్ 17న జరిగే విలీనము , విమోచనము పేరుతో ప్రజలను గందరగోళ పరుస్తున్నారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పరోక్షంగా ఎలాంటి పాత్రలేని పార్టీలు మతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతూ, విడదీసే చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ యొక్క పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు అని గుర్తు చేశారు. ఈ యొక్క చరిత్రను ప్రజలు, కార్మిక వర్గము, మరింత అధ్యయనం చేసి భూమి, ప్రజా సమస్యలు, కార్మిక వర్గ సమస్యలను గుర్తించి పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే రాజయ్య, ఏ మాణిక్యం, సిపిఎం సీనియర్ నాయకులు వాజిద్ అలీ, పి పాండురంగారెడ్డి, సిపిఎం నాయకులు జి జార్జ్, ఎం శ్రీనివాసులు రెడ్డి, చంద్ర కిరణ్ సింగ్, రామచంద్రమూర్తి, మనీ రాజు, బివిఆర్ కే రాజు, రామకృష్ణ, నారాయణ, శ్రీనివాసు ఇతరులు పాల్గొన్నారు.



## క్యాబ్ & స్కూల్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్11( వాయిస్ టుడే): ట్రాన్స్పోర్ట్ రంగానికి సంబంధించిన స్కూల్ మరియు క్యాబ్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని పొట్లూరి నాగేశ్వర్ రావు భవన్ (ఏఐటీయూసీ) కార్యాలయంలో నిర్వహించడం జరిగినది.ఈ సమావేశానికి ప్రవీణ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఏ ఐ టి యూ సి రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ యూసుఫ్,సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ లు మాట్లాడుతూ 1920లో ఏ ఐ టి యూ సి నీ స్థాపించడం జరిగినది.నాటి నుండి నేటి వరకు కార్మికుల పక్షాన కార్మిక హక్కుల సాధనకై నిరంతరం పోరాడే ఏకైక సంఘం ఏ ఐ టి యూ సి అని తెలిపారు అందులో భాగంగా నేడు నగరంలోని క్యాబ్, డ్రైవర్లు స్కూల్ కాలేజీల పిల్లల రవాణా కి బండ్లు పెట్టి నడుపుతున్న డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారి హక్కుల సాధనకై వారికి సౌకర్యాల కల్పనకై నిరంతరం అండగా ఏ ఐ టి యూ సి ఉంటుందని తెలిపారు.అసంఘటిత రంగంలో పని చేస్తున్న ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లందరికీ మిగిలిన అసంఘటిత కార్మికులతో కలిపి సంక్షేమ బోర్డు ను ఏర్పాటు చేయాలని,అట్టి బోర్డు ద్వారా సంక్షేమ పథకాలైన ఇన్సూరెన్స్,వైద్య సదుపాయాలు, డ్రైవర్ల పిల్లల చదువులకు ఫీజులు,ఇండ్లు లేని వారికి ఇండ్ల సౌకర్యం,60 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ అమలు చేసే విధంగా సంక్షేమ బోర్డు ఉండాలని డిమాండ్ చేశారు.డ్రైవర్లకు కనీస వేతనం 36000 రూపాయలుగా జి.ఓ విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీనీ ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ప్రవీణ్,అధ్యక్షునిగా శ్రీరామ్ శ్రీనివాస్ చారి,ఉపాధ్యక్షునిగా మేకల శ్రీనివాస్,కార్యదర్శిగా మురళి,సహాయ కార్యదర్శి గా పెంటా రెడ్డి,కోశాధికారిగా గోవర్ధన్,ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ రావు, లతో పాటు కమిటీ సభ్యులుగా 7గురితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యూ సి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వామి,శ్రీనివాస్,మండల అధ్యక్షులు హరినాథ్ రావు,నాయకులు దుర్గయ్య,డప్పు రామస్వామి,బాబు తదితరులు పాల్గొన్నారు.



## హత్యకు గురైన రేణు అగర్వాల్ కుటుంబ సభ్యులను పరామర్శించి హంతకులను పోలీసులు త్వరగా పెట్టుకోవాలి

### టిపిసిసి ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి బండి రమేష్

కూకట్పల్లి, సెప్టెంబర్ 11(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం స్వాన్ లేక్ అపార్ట్మెంట్లో హత్యకు గురైన రేణు అగర్వాల్ కుటుంబ సభ్యులను టిపిసిసి ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి బండి రమేష్ గురువారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతురాలి భర్త రాకేష్ అగర్వాల్ ను పోలీసులను సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపి ఈ ఘటనను ఖండించారు. నిందితులను త్వరగా పట్టుకోవాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య , ఏ బ్లాక్ అధ్యక్షులునాగిరెడ్డి , బిబ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శివ చౌదరి, సుదర్శన్, భరత్ పాల్గొన్నారు.



## యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

నాచారం (వాయిస్ టుడే):యువత లాభసాటి వ్యాపారాలపై దృష్టి సారించి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయి కి ఎదగాలని ఎమ్మెల్సీ మల్లన్న అన్నారు. హబ్సిగూడ లో బ్రహ్మణి ప్లెక్సీ ప్రింటింగ్ షాపు ను మల్లన్న, బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి లు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై షాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నరేష్ మాట్లాడుతూ తమ వద్ద ఆధునిక పద్ధతుల తో నాణ్యమైన ముద్రణ సదుపాయాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరి శంకర్ గౌడ్, రఘుపతి గౌడ్, రాంబాబు, ప్రకాష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, అంజి, సోను, కరాటే శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## జన్మదిన వేడుకలు పాల్గోన్న గ్రంధాలయం సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి పట్టణంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త ఎడ్ల వెంకట్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయనను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఎండి అవైస్ చిస్తీ,డీసీసీ కార్యదర్శి మజర్ పాల్గోన్నారు.



## టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ నామినేషన్

నాచారం (వాయిస్ టుడే):ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగ సంఘాల ఎన్నికల నేపథ్యంలో గురువారం టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ పానెల్ నామినేషన్ దాఖలు చేశారు. అధ్యక్షులుగా కేఎస్ నాగరాజారావు ప్రధాన కార్యదర్శిగా అక్బర్ బేగ్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అబ్దుల్ జలీల్, బి రామాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి బిక్షపతి, సెక్రటరీలుగా ఇగ్బాల్ హుస్సేన్, మహేశ్వర్, రాజేష్, కోశాధికారిగా ఎస్ మల్లేష్ తదితరులు నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఉన్నారు. నామినేషన్ అనంతరం వివిధ కళాశాల తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గొడుగు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.



## కూకట్పల్లిలో స్టీల్ వ్యాపారి రాకేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శ

కూకట్పల్లి, సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని స్టీల్ వ్యాపారి రాకేష్ భార్యను దారుణంగా హత్య చేసిన ఇద్దరు పనివాళ్ళను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కృష్ణారావు పోలీసులను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లా అండ్ ఆర్డర్ విఫలం అయిందని, ఇటీవల కాలంలో కూకట్ పల్లి లో తరచూ హత్యలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చిన్నపిల్ల సహస్ర హత్యకేసు, కే.పి.హెచ్.బి లో వృద్ధ దంపతులను కట్టేసి డబ్బులు ఎత్తుకెళ్లారు అని గుర్తు చేశారు. హోం శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఎందుకు పోలీసు శాఖపై దృష్టిసారిచడం లేదని అన్నారు. ఇప్పటికైనా శాంతి భద్రతలుపై దృష్టి పెట్టాలని, తప్పు చేయాలన్న ఆలోచనే రాకుండా నిందితులకు కఠిన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు.

## నిజాంపేట రోడ్డు ఫుట్ పాత్పై అపస్మారక స్థితిలోని వ్యక్తి

### ప్రాజెక్ట్ అధికారి భోగేశ్వర్ల మానవత దృక్పథంతో చేయూత



కూకట్పల్లి: సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): కూకట్ పల్లి నియోజకవర్గం మున్సిపల్ సర్కిల్ నందు నిజాంపేట రోడ్డు ప్రాంతంలో ఫుట్ పాత్ పై అపస్మారక స్థితిలో పడి ఉన్నటు నిరాశ్రయున్ని మహేష్ అనే వ్యక్తిని గత మంగళవారం రోజున స్థానికులు కూకట్ పల్లి సర్కిల్ ప్రాజెక్ట్ అధికారి భోగేశ్వర్లుకు స్థానికులు అందించిన సమాచారం మేరకు కూకట్ పల్లి సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ పాప గౌడ్ అతని వివరాలు సేకరించగా అతను విపత్కర పరిస్థితుల్లో గత మూడు నెలల క్రితం హన్మకొండ నుండి హైదరాబాద్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అతని పేరు మహేష్ (55) అని, స్వస్థలం హనుమకొండ కాగా అతనికి వెనుక ముందూ ఎవరూ లేరని, అన్నకూతురు దగ్గర ఉంటున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో అతను ఎటు వెళ్లాలో ఏమీ తెలియని పరిస్థితిలో తనను ఎవరూ ఆదుకోవడం లేదని స్వస్థలానికి పంపిస్తే తాను వెళ్ళిపోతానని చెప్పడంతో ప్రాజెక్ట్ అధికారి భోగేశ్వర్ సాటి మనిషిగా మానవత దృక్పథంతో అతనిని బస్టాండ్ దాకా తీసుకెళ్లి హనుమకొండ బస్సు టికెట్ తీసి బస్సు ఎక్కించవలసిందిగా సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా గురువారం సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుండి హనుమకొండ బస్సు టికెట్ తీసి బస్సు ఎక్కించారు. ఈమేరకు కృతజ్ఞతా భావంతో మేడంకు దీంతో ఆయన వెళుతూ రెండు చేతులు జోడించి నమస్కారం చేయడం వల్ల కళ్ళు చెమ్మగిల్లాయి.

# ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మహేంద్ర హిల్స్‌కు జాతీయ ప్రిన్సిపాల్స్, టీచర్స్ అవార్డు -2025

నాచారం: జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పి) 2020 ఐదు సంవత్సరాలు సందర్భంగా సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతదేశంలోనే అతిపెద్ద విద్యా సదస్సు-2025ను న్యూఢిల్లీలో నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రతినిధులను జాతీయ ప్రిన్సిపాల్స్ మరియు టీచర్స్ అవార్డులతో సత్కరించారు. ఇందులో భాగంగా ఎన్ ఈ పి 2020 లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆదర్శవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మహేంద్ర హిల్స్ కు జాతీయ ప్రిన్సిపల్ అవార్డుతోపాటు ఐదుగురు ఉపాధ్యాయులకు ప్రతిష్టాత్మకమైన అవార్డులు అందుకున్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మహేంద్ర హిల్స్ ప్రిన్సిపాల్ నందిత సుంకర తన డైనమిక్ నాయకత్వం మరియు విద్యకు అత్యుత్తమ కృషి చేసినందుకు జాతీయ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్నారు. దీంతో పాటు గా ఎన్ ఈ పి అమలు చేయడంలో ఉన్న సవాళ్లపై చర్చించడానికి ప్యానెలిస్టులలో ఒకరిగా కూడా ఎంపికయ్యారు. ఇది సంస్థకు మరిన్ని కీర్తిని తెచ్చిపెట్టింది.

2025 జాతీయ ఉపాధ్యాయ అవార్డులను ప్రారంభ సంవత్సరాల విద్యా సమన్వయకర్త పావని వినీత్ కోటక్ స్వీకరించారు, ఆమె ఆదర్శప్రాయమైన కృషికి గుర్తింపు పొందారు. సీనియర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ యోహాన్ గోపథోటి క్రీడా విద్యకు చేసిన కృషికి ప్రశంసలు అందుకున్నారు. కంప్యూటర్ సైన్స్ మరియు పరీక్షల ఇన్‌ఛార్జ్ హెచ్ఓడీ కె. లావణ్య తన విద్యా నైపుణ్యం మరియు సంస్థాగత నైపుణ్యాలకు గుర్తింపు పొందారు. పివిఎ ఇన్‌ఛార్జ్ శ్రీమతి శిరీష కె. తన సృజనాత్మక నాయకత్వానికి గుర్తింపు పొందారు. మామిడిపల్లి శ్రీశైలం,ఏరోబిక్స్ బోధకుడు, ఫిట్‌నెస్, ప్రదర్శన కళలను ప్రోత్సహించడంలో తన కృషికి గుర్తింపు పొందారు. ఈ సమిష్టి విజయం విద్యా నైపుణ్యం, సమగ్ర అభివృద్ధి మరియు విద్యలో ఆవిష్కరణల పట్ల పాఠశాల యొక్క నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. ఈ అవార్డులు పాఠశాల సమాజానికి అపారమైన గర్వాన్ని తీసుకురావడమే కాకుండా, NEP 2020 పరివర్తన లక్ష్యాల కోసం పనిచేయడం కొనసాగించడానికి ప్రేరణగా కూడా పనిచేస్తాయి. అవార్డు విజేతల అంకితభావ ప్రయత్నాలకు యాజమాన్యం మరియు సిబ్బంది అభినందించారు. ఈ గుర్తింపుతో, సభ్యులు పాఠశాల పట్ల వారి నిబద్ధతపై తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారు.





## ఎత్తిపోతల పథకాల పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పరిశీలన**

**జిల్లాలో యూరియా సరిపడా ఉంది**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

హుజూర్ నగర్ సెప్టెంబర్ 11 (వాయిస్ టుడే ప్రతినిధి) : హుజూర్ నగర్ నియోజకవర్గం చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో నిర్మిస్తున్న రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్, వెల్లటూరు వద్ద ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను గురువారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెల్లటూరు ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం హైదరాబాద్ లో ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబందించిన ఇరిగేషన్ ప్రాజెక్టు ల పురోగతిపై రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించి వేగవంతంగా పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారని తెలిపారు.

వెల్లటూరు గ్రామంలో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ కు సంబంధించి అక్కడక్కడ భూసేకరణకు సంబంధించి టైటిల్,సరిహద్దులు, ఆటవి శాఖ వివాదాలు ఉన్నాయని వాటిని క్షేత్ర స్థాయి లో పరిశీలించటం జరిగిందని అన్నారు. సమస్య ఉన్నా రైతులతో విడివిడిగా మాట్లాడి, ఆ భూములకి సంబందించిన ఆధారాలు జతపర్చి ఆర్డీఓ కి దరఖాస్తు సమర్పించాలని వాటిని 15 రోజులలో పరిశీలించి చట్ట ప్రకారం రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. ఇప్పటికే ముత్యాల బ్రాంచ్ కెనాల్ కు సంబంధించి భూసేకరణ పూర్తయిందని గ్రామాల వారీగా అవార్డులు జారీ చేసి ఎలాంటి వివాదం లేని రైతులకు 30 కోట్ల రూపాయలు నష్టపరిహారం కింద రైతులకు చెల్లించడం జరిగిందని అన్నారు. వర్షాలు తగ్గినందున ఎక్కువ మిషనరీని ఏర్పాటు చేసుకొని, కావాల్సినన్ని పైపులు సమకుర్చుకొని, ఎక్కువ సిబ్బందిని నియమించి పైప్ లైన్లు త్వరగా వేయాలని అదేవిధంగా పంప్ హౌస్ నిర్మాణ పనులు కూడా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు..

జిల్లాలో యూరియా సరిపోను ఉందని, రైతులకు ఎంత అవసరం ఉంటే అంతే తీసుకోవాలని, ముందస్తుగా తీసుకొని నిల్వ చేసుకోవద్దని బుధవారం ఒక వ్యాగన్,ఈరోజు ఒక వ్యాగన్ యూరియా వచ్చిందని వాటిని వ్యవసాయ అధికారుల ద్వారా అన్ని పి ఏ సి ఎస్, ఆగ్రో సెంటర్ లకు సరఫరా చేసి రైతులకు పంపిణి చేసేలా చర్యలు తీసుకోవటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు,తహసిల్దార్ సురేందర్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈలు అశోక్, సత్యనారాయణ, డి ఈ స్వామి, ఏ ఈ శ్రీనివాస్, ఎఫ్ ఆర్ ఓ ఆదిత్య,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## సైన్స్‌తోనే సమాజ పురోగతి సాధ్యం

తొర్రూరు, సెప్టెంబర్ 11 వాయిస్ టుడే : సమాజ సమగ్ర పురోగతి సైన్స్‌తోనే ముడిపడి ఉందని, విజ్ఞాన శాస్త్రంపై మరింత అవగాహన పెంచుకునేందుకు శ్రద్ధతో కృషి చేయాలని మాటేడు పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం,రిటైర్డ్ ఎంఈఓ పాకనాటి ఇందుమతి-లక్ష్మారెడ్డి, తొర్రూరు ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య పేర్కొన్నారు. మండలంలోని మాటేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం గ్రామానికి చెందిన ఎన్నారై ఆలకుంట్ల సుధాకర్ సహకారంతో జీవ భౌతిక రసాయన శాస్త్ర ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. ఎన్‌ఆర్‌ఐ సుధాకర్ మాతృమూర్తి ఆలకుంట్ల సత్తెమ్మ జ్ఞాపకార్థం రూ.60 వేల విలువచేసే సైన్స్ పరికరాలను పాఠశాలకు దాత తండ్రి ఆలకుంట్ల ఎల్లయ్య చేతుల మీదుగా ప్రయోగశాల పరికరాలు పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, విద్యార్థి దశనుంచి సైన్స్, పరిశోధనలపట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ఆధునిక ప్రపంచంలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం లేకుండా జీవితాన్ని ఊహించలేమన్నారు. పాఠశాలలో ప్రయోగశాల ఏర్పాటుకు పూర్వ విద్యార్థి, ఎన్నారై సుధాకర్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.ప్రభుత్వ బడుల బలోపేతానికి అందరూ తోడ్పాటు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్ పర్సన్ డాక్టర్ ఎస్. నాగవాణి, పిఎసిఎస్ డైరెక్టర్ కె. జనార్ధన్ రాజు, పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్,రిటైర్డ్ హెచ్‌ఎంలు నరసింహారెడ్డి,భాస్కరాచారి, దాత తండ్రి ఆలకుంట్ల సుధాకర్, స్థానికులు లేగల వెంకటరెడ్డి,పినాకపాణి, శివరాత్రి జ్యోతి, ఏఏపిసి చైర్మన్ దుర్గమ్మ, ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, హేమలత, ఎల్ల గౌడ్, సంజయ్, రాజు, శోభ, యాకాంబరం తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు సత్రప్రవర్తనతో మెలగాలి

**నేరాలలో పాల్గొంటే తీవ్ర పరిణామాలు: సిఐ కిషన్**

కాజీపేట, వాయిస్ టుడే: మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ లు సత్రప్రవర్తనతో మెలగాలని మడికొండ సిఐ పుల్యాల కిషన్ అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్ కు పిలిచి సిఐ కిషన్ కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచన మేరకు రౌడీ షీటర్లను ప్రతి నెల క్రమం తప్పకుండ విధిగా స్టేషన్ కు హాజరు కావాలని సూచించారు. అంతే కాకుండా వారి జీవన స్థితి గతులను, వారి ఆదాయ మార్గాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు వారి నేర ప్రవృత్తిని విడనాడాలని, ఎటువంటి నేరాలకు సంబంధించిన చర్యలలో పాల్గొనకూడదని, ఎవరైనా నేరాలలో పాల్గొంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమం ఎస్సై లు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# వీర తెలంగాణ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి

**సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు చేయాలి**

**మిర్యాలగూడలో జరిగిన వారోత్సవాల్లో తమ్మినేని**




మిర్యాలగూడ సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): నాది వీర తెలంగాణ రైతంగ సాయుధ పోరాటాన్ని బిజెపి మతం రంగు పూసి చరిత్రను వక్రీకరిస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా సిపిఎం అగ్రనేతలను పూల వర్షంతో ఘనంగా స్వాగతం పలితారు.. అంబేద్కర్ జగ్జీవన్ రావ్ విగ్రహాలకు, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆనాడు భూస్వాములు, పెత్తందారులు, నిజాం నవాబులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో సబ్బండ వర్గాలు కులమతాలకు అతీతంగా పోరాటం సాగించాలని చెప్పారు. ఎంతోమంది ముస్లిం నాయకులు నాయకత్వం వహించి ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. నాడు పీడత ప్రజల కోసమే సాయుధ పోరాటం సాగిందని ఆ పోరాట ఫలితంగా నేడు ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారని చెప్పారు. దేశ స్వతంత్రంలో తెలంగాణ సాయుధ పోరాటంలో బిజెపి పార్టీ లేదని, కానీ ఆ పోరాటాన్ని ముస్లిం హిందువుల మధ్య జరిగినట్లు చరిత్రను వక్రీకరిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఆనాటి పోరాట చరిత్రను ప్రజలకు వివరించి చైతన్యపరిచేందుకు సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి ఎర్రజెండనే భవిష్యత్తు ప్రత్యామ్యాయమని తెలిపారు. దేశ సంపద ప్రజలందరికీ చెందాలని ప్రజలందరూ సమానంగా హక్కులు పొందాలని ఎర్రజెండా పోరాడుతుందని తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ ఎర్రజెండా వైపు చూస్తున్నాయని, భవిష్యత్తు ఎర్రజెండాకే ఉంటుందన్నారు. ప్రపంచ శాంతి కోసం ఎర్రజెండా పని చేస్తుందని అసమానతలు లేని సమాజం ఎర్రజెండాతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ఐదు సంవత్సరాలు పాటు సాగిన పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి ఇచ్చారని 4500 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నాటి సాయితో పోరాటం స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. నాది అమరవీరుల వారసులుగా భవిష్యత్తు ఉద్యమాలు చేయాలన్నారు. ఈ నెల 17న నల్గొండలో వారోత్సవాల సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్ హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా నల్గొండ నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. గ్రామ సీనియర్ నాయకులు వెంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం నల్గొండ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాసం, బండ శ్రీశైలం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మూడవత్ రవి నాయక్ జిల్లా కమిటీ సభ్యులు పాదూరి శశిధర్ రెడ్డి, చౌగాని సీతారాములు, పోలేబోయిన వరలక్ష్మి, వినోద్ నాయక్,సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర, డా.మల్లు గౌతమ్ రెడ్డి, బావాండ్ల పాండు నాయకులు కృష్ణయ్య, లతీఫ్, చంటి, గోపి, గోవర్ధన, అరుణ, పులమ్మ,బాలాజీ, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



## ఈవీఎం గోదాంలను తనిఖీ చేసిన కలెక్టర్ స్నేహ శబరీష్

**పాల్గొన్న వివిధ పార్టీల ప్రతినిధులు, అధికారులు**

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ఈవీఎం గోదాంలను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మూడు నెలలకోసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ హనుమకొండ జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈవీఎం లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈవీఎం గోదాంల ఉన్న భద్రతా చర్యలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకుని పరిశీలించారు. అదేవిధంగా హైకోర్టు ఉత్తర్వుల ననుసరించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్లమెంట్ ఎన్నికలలో వినియోగించిన ఈవీఎంలను భద్రపర్చిన గోదాం ను కూడా పరిశీలించి, నియమిత గోదాంనకు తరలించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ, పరకాల తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, విజయ లక్ష్మీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ.వీ శ్రీనివాస రావు, శ్యామ్ సుందర్, రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## కొలువు దీరిన కొత్త కమిటీ అట్టహాసంగా జరిగిన మహాసభ



(11 సెప్టెంబర్ 2025 వాయిస్ టుడే మహబూబాబాద్) ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా మహబూబాబాద్ బ్రాంచ్ 7వ మహాసభ పద్మశాలి భవన్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు కుమార్ రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రాంనర్సయ్య వరంగల్ డివిజన్ ప్రెసిడెంట్ తాళ్లూరి శ్రీనివాసరావు వరంగల్ డివిజన్ కార్యదర్శి కమటం స్వామి విచ్చేశారు మహాసభ అనంతరం మహబూబాబాద్ బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది ఈ కమిటీలో అధ్యక్షుడిగా మీగడ లింగయ్య ప్రధాన కార్యదర్శిగా బానోతు సేవియా కోశాధికారిగా తీగల రాజేందర్ తో పాటు 36 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీకి అనుబంధంగా రాష్ట్ర చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా మహబూబాబాద్ బ్రాంచ్ లో మహిళా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మహిళా విభాగం కన్వీనర్ గా డి శ్వేత మరియు పి రమాదేవి తదితరులను ఎన్నుకోవడం జరిగింది కొలువుదీరిన కొత్త కమిటీలోని సభ్యులు మాట్లాడుతూ పదవి అనేది అలంకారప్రాయం కాదని తమపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను స్వార్థ ప్రయోజనాలకు కాకుండా యూనియన్ బలోపేతానికి కృషి చేస్తూ ఏజెంట్ల యొక్క సమస్యలపై పోరాడుతూ ప్రతి ఏజెంట్ కు వెన్నుదన్నుగా నిలబడుతూ మనసా వాచా కర్మణా నిర్వర్తిస్తామని అభిప్రాయపడ్డారు అలాగే శుక్రవారం నర్సంపేట లో జరిగే డివిజన్ మహాసభను జయప్రదం చేయాలని నూతన కార్యవర్గం అధ్యక్షతన అత్యధిక సంఖ్యలో తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**హుజూర్నగర్ తాసిల్దార్ కార్యాలయల ముందు సిపిఎం ధర్నా**



హుజూర్ నగర్ సెప్టెంబర్ 11 (వాయిస్ టుడే ప్రతినిధి ) ప్రజాసమస్యలను పాలకులు వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుర్గి ,బ్రహ్మం మండల కార్యదర్శి పోసన బోయిన, హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హుజూర్నగర్ మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని, డిమాండ్ చేస్తూ సిపిఎం హుజూర్నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 29 నుండి సెప్టెంబర్ 10 వరకు ప్రజా సమస్యలపై నిర్వహించిన సర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని హుజూర్నగర్ తాసిల్దార్ కార్యాలయాల ముందు ధర్నాచేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అనేక సమస్యలతో ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల మూలంగా మండల వ్యాప్తంగా గ్రామాలలో డ్రైనేజీ లేక వర్షపు నీరు రోడ్లపై పారుతుందని ఇళ్లల్లో కూడా వస్తున్నాయని అన్నార నీళ్లు ఇళ్లలోకి వచ్చినప్పుడు ఉండలేకపోతున్నామని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలైన ఇందిరమ్మ ఇండ్లు అధికార పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. స్థలం లేని పేదవారికి ప్రభుత్వం స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12000 ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేతి వృత్తిదారులు గత ఐదు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని నేటికీ వారికి పింఛన్ ఇవ్వడం లేదన్నారు. గత ఎన్నికల సందర్భంగా పింఛన్లను 2000 నుండి 4 వేలకు, వికలాంగులకు 4000 నుండి 6వేలకు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్న నీటికి ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు 2500 వెంటనే అమలు చేయాలన్నారు. సీతారాంపురం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి అర్హులైన పేదలందరికీ పంపిణీ చేయాలన్నారు. అన్నారు. అమరవరం గ్రామం నుండి బక్క మంత్రుల గూడెం వరకు లింకు రోడ్ ఏర్పాటు చేయాలని అన్నారు మండల వ్యాప్తంగా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు మండల కేంద్రం నుండి బేతవోలు గ్రామం వరకు రోడ్డు నిర్మాణంలో ఉన్నది కరక్కాయల గూడెం గ్రామంలో వర్షాలు ఎక్కువగా వచ్చినప్పుడు బ్రిడ్జి డౌన్ లో ఉండటం ద్వారా రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నది వెంటనే అక్కడ హైట్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ బ్రిడ్జి కోసం సిపిఎం అనేక ధర్నాలు చేసిన పాలకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కరక్కాయల గూడెం నుండి బేతవోలు వరకు లింకు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. గత ప్రభుత్వంలో పల్లె దవాఖానాలు నిర్మాణం చేపట్టారు కానీ అవి పూర్తి కాలేదు వాటిని వెంటనే పూర్తి చేసి అక్కడ డాక్టర్లను అందుబాటులో ఉంచాలి ఇటీవల కురిసిన వర్షాలు మూలంగా గ్రామాలలో దోమలు విపరీతంగా ఉన్నాయి వాటి ద్వారా విష జ్వరాలు వస్తున్నాయి టైఫాయిడ్ మలేరియా డెంగ్యూ వంటి జబ్బులు విపరీతంగా ఉన్నాయి వెంటనే ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించాలన్న వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని హుజూర్నగర్ తాసిల్దార్ కి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు చందాల, బిక్షం సిద్ధల ,వెంకటయ్య షేక్, ఖాసిం షేక్ ,సైదా కొప్పుల, నాగమ్మ మాదూరి ,నరసింహ చారి ఆవుల ,సైదులు నెట్టి, వెంకటేశ్వర్లు చింతకుంట్ల, సైదయ్య నాయకులు మేగడ, రాములు తంగేళ్ల, గోపరాజు బుద్ధి ,బాల సైదులు తేనె, సీతారాములు అన్నపు నేను, మాధవరావు సికూర్, తిరపయ్య శ్రీరాములు, శ్రీను బుజ్జి బాబు భాస్కర్ నరేష్ సిద్దుల, అంజి హరీష్, మల్లమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, సైదమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో బస్టాండ్ నిర్మాణం

**కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు**

**భూపాలపల్లి జిల్లాకు రైల్వే స్టేషన్, కొత్త రైల్వే లైన్లు ఏర్పాటు**

**రైల్వే బైపాస్ లైన్ లకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలి**

**వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య**

**రైల్వే ప్రాజెక్టులపై సీఎం నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న ఎంపీ**



ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: కాజీపేట రైల్వే స్టేషన్ ముందు బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన కీలక సమీక్షా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పైన జరిగిన సమీక్ష సమావేశంలో భాగంగా వరంగల్ కు సంబంధించి రైల్వే సమస్యలపై ఎంపీ కావ్య ముఖ్యమంత్రి ముందు ప్రస్తావించారు. కాజీపేటలో రైల్వేకు సంబంధించిన స్థలాన్ని బస్టాండ్ నిర్మాణానికి కేటాయిస్తే.. దానికి బదులుగా మరో చోట రైల్వేకు స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీ తెలియజేశారు. అందుకు సీఎం రేవంత్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందిస్తూ మరో ప్రాంతంలో స్థలం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజలు, రైల్వే ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మల్టీ మోడల్ బస్టాండ్ నిర్మాణానికి సహకరించాలని ఎంపీ కోరారు. రైల్వే శాఖ మంత్రి దీనికి సంబంధించి ఆదేశాలను కూడా సంబంధిత జోనల్ అధికారులకు అందజేస్తామని వెల్లడించారు. అలాగే భూపాలపల్లికి కొత్త రైల్వే స్టేషన్, రైల్వే లైన్‌ను మంజూరు పై ఎంపీ ప్రస్తావించారు. భూపాలపల్లి సింగరేణి కాలరీస్, టిజిజెన్కో నుండి బొగ్గును రవాణా చేయడానికి ట్రక్కులపై ఆధారపడుతుందన్నారు. రైల్వే లైన్ మంజూరు అయితే రోడ్డు ప్రమాదాలు, కాలుష్యం, సరుకు రవాణా ఖర్చులను తగ్గిస్తుందని, ప్రయాణీకుల ప్రయాణంతో పాటు ఆర్థిక కార్యకలాపాలను పెంచుతుందని తెలిపారు.

అదేవిధంగా కాజీపేటను రైల్వే డివిజన్ చేస్తే రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరం వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాజెక్టులు ప్రయాణం, వాణిజ్య రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తాయని ఎంపీ కావ్య అన్నారు. ఉద్యోగ కల్పన, వ్యాపార వృద్ధి, వరంగల్ కీలకమైన కనెక్టివిటీ హబ్‌గా ఉంటుందని స్పష్టం చేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుతో రైల్వేకు అత్యధిక రెవెన్యూ అందించబడుతుందని ఎంపీ కావ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన బైపాస్ లైన్ ల విషయాన్నీ కూడా ఎంపీ కావ్య ప్రస్తావించారు. నష్కల్ నుండి వరంగల్ నగరానికి రెండు రైల్వే బైపాస్ లైన్లు, ఒకటి నష్కల్ నుండి చింతపల్లి వరకు మరియు నష్కల్ నుండి హసన్ పర్తి వరకు రైల్వే డిపార్ట్మెంట్ ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఓఆర్ఆర్ నిర్మాణం కారణంగా ఇప్పటికే రైతులు నష్టపోయారని.. మరోసారి ఈ రైల్వే లైన్ల కారణంగా రైతులు మరిన్ని భూముల కోల్పోయి వ్యవసాయ రంగం చిన్న భిన్నం కానుందన్నారు. ట్రయాంగిల్ రైల్వే విధానంతో వరంగల్ నగర అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. అక్కడి రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అలైన్మెంట్ మార్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వివరించారు. ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యల పరిష్కారం కొరకు కేంద్ర మంత్రులను అధికారులను కలిసిన ఎంపీ కావ్య మరోసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తానని వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ట్రాన్స్ పోర్ట్ అండ్ బిల్డింగ్స్ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో పాటు పలు విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని





**నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి**

**కే.యూలో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని**

హనుమకొండ, వాయిస్ టుడే: పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గురువారం 10 వ డివిజన్ కాపువాడ మరియు 11 వ డివిజన్ లలో రూ.60 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యత పరంగా అన్ని డివిజన్ లలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. శంకుస్థాపన చేసిన ప్రతి పనిని సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా డివిజన్ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, దేవరకొండ విజయ సురేందర్, డివిజన్ అధ్యక్షులు కుమార్ యాదవ్, సంగీత్ మరియు ముఖ్య నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

**తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని**

గురువారం కాకతీయ విశ్వవిద్యాలయం లో తీజ్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ గిరిజనులందరికి తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సాంస్కృతిక వైభవానికి తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. గిరిజన మహిళలు ఆనందంగా జరుపుకునే ప్రకృతి పండగ తీజ్,అని భక్తి శ్రద్ధలతో జరుపుకోవలన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ గొప్పగా పూజించే గిరిజన సాంస్కృతిక పండగ తీజ్ ఉత్సవాల్లో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ప్రకృతి తమను చల్లగా చూడాలని ఎమ్మెల్యే కోరుకున్నారు. పూలను, ప్రకృతిని ఆరాధిస్తూ పండుగలు జరుపుకోవటం మన సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నంగా మారిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలియజేశారు. ఈ వేడుకల్లో మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, ప్రొఫెసర్ సురేష్ లాల్, డాక్టర్ జి.రాజు నాయక్, యూత్ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ అశ్విన్ రాథోడ్, యూత్ కాంగ్రెస్ స్పోక్స్ పర్సన్ వినోద్ లోక్ నాయక్, మాలోత్ రమేష్ నాయక్, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు వెంకట్ నాయక్, రమేష్ నాయక్, అశోక్, తిరుపతి, ఆలోజి, స్నేహ,నవ్య, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగయ్య**



వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 11 : సిపిఎం పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య అధ్యక్షత వహించగా సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య హాజరైనారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వరంగల్ నగరంలో దాదాపు 30 సెంటర్లలో పేద ప్రజలు గుడిసెలు వేసుకుని అనేక సంవత్సరాలుగా నివాసముంటున్నారని ఇప్పటివరకు వారికి ఎలాంటి పట్టాలు ఇవ్వలేదని అన్నారు. ఈ ప్రజలంతా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన పేద ప్రజలని వారంతా కిరాయి ఇండ్లలో నివసించలేక కిరాయిలు కట్టలేక ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వారందరికీ డబల్ బెడ్రూంలు ఇస్తామని పట్టాలిస్తామని మోసం చేస్తే, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక పేద ప్రజలకు నివాస స్థలాలు ఇస్తామని, గుడిసెలకు పట్టాలు ఇస్తామని, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని అనేక హామీలు ఇచ్చిందని ఆ హామీలను నమ్మి,పేద ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించడం వల్లనే ఇక్కడ కాంగ్రెస్ తరపున ఏమ్మెల్యే మంత్రులు అయ్యారని అన్నారు.

కానీ గెలిచిన తర్వాత ఇప్పటివరకు పేద ప్రజల వైపు చూసిన పాపాన పోలేదని విమర్శించారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు నిర్దిష్టమైన కొలతలతో జాగా ఉంటేనే మంజూరు చేస్తామంటూ రకరకాల పేచీలు పెడుతున్నారని ఎలాంటి నిబంధనలు పెట్టకుండా 30 నుండి 40 గజాల ఇంటి స్థలం ఉన్న వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. దూపకుంట ఏరియాలో కట్టిన ఇండ్లు పడావు పడిపోయి, శిథిలవస్థకు చేరుకుంటున్నాయని, గతంలో ఖిలా వరంగల్ ఏరియాలో ఎంతోమందికి అవి కేటాయిస్తామని కొంతమందికి పట్టాలు కూడా ఇచ్చారని కానీ వాటిని ముట్టుకున్న పాపానికి పోలేదని అన్నారు. ఓ ఎస్ నగర్, లాంటి దేవాదాయ భూములను ప్రభుత్వమే కొని ప్రజలకు ఇవ్వాల్సిందిగా కోరారు. చెరువు శిఖం కి సంబంధించి నగరంలో ఎలాంటి పారకము లేదు కాబట్టి ఆ గుడిసెలకు కూడా పట్టాలు ఇవ్వచ్చని అన్నారు. గోవిందరాజుల గుట్ట చుట్టూ 54 కుటుంబాలు దాదాపు 150 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని ఇప్పుడు వారిని భూ ఆక్రమిత దారులుగా పేర్కొంటూ ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ఇచ్చిన నోటీసులను వెనక్కు తీసుకోవాల్సిందిగా కోరారు. జిల్లా కమిటీ నాయకులు సింగారపు బాబు , నలిగంటి రత్నమాల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుండా కాలయాపన చేస్తే ఊరుకునేది లేదని భవిష్యత్తులో నగరంలోని పేద ప్రజలందరినీ సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సిపిఎం నాయకత్వం కలెక్టర్ సత్య శారద కి మెమోరాండం, మరియు ప్రజల దరఖాస్తులను అందజేశారు. కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ దేవదాయ భూములు, ప్రభుత్వ భూములు, మల్లు స్వరాజ్యం నగర్ రాజీవ్ గృహకల్ప కు సంబంధించిన భూముల తో పాటు పంపిణీకి అనుకూలంగా ఉన్న భూములన్నీ పేదలకు పంచడానికి ప్రయత్నం చేస్తామని హామీని ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం పార్టీ వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు యం డి బషీర్, వల దాసు దుర్గయ్య, వివిధ ఏరియాలో పార్టీ నాయకులు సాంబమూర్తి, ప్రశాంత్, రమేష్, దివ్య, వాణి, ఆలం, గాలయ్య, భవాని, విజయ తదితర నాయకులతో పాటు సుమారుగా 800 మంది గుడిసె వాసులు పాల్గొనడం జరిగింది.

## 11 ఏళ్లుగా మోదీ సర్కార్‌కు అండగా నిలిచిన దేశ ప్రజలు

**మోదీ ప్రభుత్వ మార్గనిర్దేశంలో భారత్ స్థిరంగా నిలబడింది.**

**దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను దీటుగా ఎదుర్కొని నిలిచిన మోది సర్కార్.**

**కుట్రలు,కుతంత్రాలతో మోడీ ప్రభుత్వాన్ని కదిలించలేకపోయారు. కానీ పొరుగు దేశాల ప్రభుత్వాలు కుట్రలకు బలైపోయాయి.**

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి,సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర**



కరీంనగర్,సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): పొరుగు దేశాలైన శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ,నేడు నేపాల్ దేశాలు ఆయా దేశ అంతర్గత శత్రువులు , విదేశీ కుట్రలకు బలైపోయి ప్రభుత్వాలను కోల్పోయాయని , భారతదేశంలో మోడీ సర్కార్ కు వ్యతిరేకంగా 11 ఏళ్లుగా ప్రతిపక్షాలు, దేశ వ్యతిరేక అంతర్జాతీయ శక్తులు అనేక కుట్రలు ,కుతంత్రాలు చేసిన ప్రజలంతా అండగా నిలిచి,మోడీ నాయకత్వానికి జై కొడుతున్నారని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి,సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ 11 ఏళ్ల విజయవంత పాలన దేశ వ్యతిరేక శక్తులకు మింగుడు పడడం లేదన్నారు.మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో అక్రమ కార్యక్రమాలకు తెరలేపి, అశాంతిని సృష్టించాలనుకున్న వాటన్నింటినీ మోడీ సర్కార్ సమర్థవంతంగా ఎదుర్కొని స్థిరంగా నిలబడిందన్నారు, ప్రధాని మోదీ ప్రభుత్వ మార్గనిర్దేశంలో భారత్ ప్రపంచంలోనే బలమైన శక్తిగా అవతరించిందన్నారు. ముఖ్యంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు విపత్కర పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. కొన్ని దేశాలు యుద్దాల బాట పడితే, మరికొన్ని అంతర్జాతీయ విదేశీ శక్తుల కుట్రలకు బలైపోతున్నాయన్నారు. ముఖ్యంగా శ్రీలంక,పాకిస్తాన్, బంగ్లాదేశ్,నేపాల్ దేశాలు శాంతియుత నిరసనలు,ఆందోళన ముసుగులో ప్రభుత్వాలు పడిపోయే పరిస్థితి తెచ్చుకున్నాయన్నారు.మోడీ ప్రభుత్వాన్ని కూల్చడానికి దేశ వ్యతిరేక శక్తులు 11 ఏళ్లుగా ఎన్నో ప్రయత్నాలు చేసినా విఫలమయ్యారని తెలిపారు. ముఖ్యంగా ఈ 11 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా ఫ్రాన్స్ ప్రభుత్వం కూలింది,నేపాల్ లో అల్లరి చేలరేగుతుంది.జపాన్ ప్రధాని రాజీనామా చేశారు,11 ఏళ్లలో పాకిస్తాన్ కు ఆరుగురు ప్రధానులు,యూకేలో 5పీఎంలు,యుఎస్ లో 4అధ్యక్షులు , శ్రీలంకలో 4 అధ్యక్షులు,ఫ్రాన్స్ లో ఇద్దరు అధ్యక్షులు వంటివి జరిగాయని, ఆ దేశాల్లో జరిగిన ప్రభుత్వాల మార్పులకు గల కారణాన్ని ప్రజలందరూ గమనించాలన్నారు.ప్రధానంగా సిఏఏ వ్యతిరేక నిరసన,నకిలీ రైతు నిరసన,అగ్ని వీర్ నిరసన,వక్ఫ్ సవరణ నిరసన లు మోడీ సర్కార్ కు వ్యతిరేకంగా జరిగాయన్నారు.ఆయా ఆందోళన సమయాల్లో ఆందోళన కారులు ఎంత రెచ్చగొట్టినా,విధ్వంసం సృష్టించిన ఒక్క తూటా పేల్చకుండా సమయమనంతో మోడీ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు.ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టి అనవసర రాద్ధాంతం చేసిందని, ఇవన్నీ కూడా మోడీ ప్రభుత్వం పై దురుద్దేశంతో ఒక ప్రణాళిక ప్రకారం చేస్తున్న కార్యక్రమాలేనని ఆయన ఆరోపించారు.ప్రధాని మోదీ పనితీరు కొన్ని అంతర్జాతీయ,దేశీయ వ్యతిరేక శక్తులు జీర్ణించుకోలేని స్థితిలో ఉన్నాయన్నారు.



## అమరవీరుల పేరున స్మృతివనం ప్రభుత్వం ఏర్పాటు చేయాలి

**తెలంగాణలో కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర.**

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.**

కరీంనగర్, సెప్టెంబర్ 11(వాయిస్ టుడే): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల కోసం హైదరాబాద్ లో స్మృతివనం ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.తెలంగాణలో కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర అని,సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తే బిజెపికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పక తప్పదని వెంకటరెడ్డి హెచ్చరించారు.సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో లో ఘనంగా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి.కొతీరాంపూర్ బైపాస్ రోడ్డులో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన అగ్ర నేతల్లో ఒకరైన బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి సిపిఐ కోతిరాంపూర్, కమాన్, బస్టాండ్, తెలంగాణ చౌక్ మీదుగా వెంకటేశ్వర టెంపుల్ ముందుగల అనభేరి ప్రభాకర్ రావు విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనభేరి విగ్రహానికి పూలమాల వేశారు.ఈ సంధర్బంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వెట్టి చాకిరీ విముక్తి కోసం, బానిసత్వానికి వ్యతిరేకంగా,ఆకలి మంటలు, ఆర్థనాదాలు,అణచివేతలకు వ్యతిరేకంగా,భూమికోసం భుక్తి కోసం దాస్య శృంఖాలాల విముక్తి కోసం పుట్టిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు.

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే నిజాం నవాబుల పరిపాలనలో కొనసాగుతున్న హైదరాబాద్ రాష్ట్రానికి (తెలంగాణకు) స్వాతంత్ర్యం రాలేదని,దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో మంది కమ్యూనిస్టులు పోరాటం చేశారని, హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నిజాం నవాబుల, దేశ్ ముఖ్ల,రజాకార్ల చేతిలో చితికి పోతున్న ప్రజల మాన,ప్రాణాలను కాపాడుకోవడం కోసం నిజాం పరిపాలన అంతం కోసం 1947 సెప్టెంబర్ 11న తెలంగాణ సాయుద రైతాంగ పోరాటానికి బద్ధం ఎల్లారెడ్డి, రావినారాయణరెడ్డి,మక్దుం మొయుద్దీన్ లు పిలుపునిచ్చారని వారి పిలుపుతో వేలాది గ్రామాలలో లక్షలాదిమంది సాయుధ పోరాటానికి ముందుకు వచ్చారని, అనేక గ్రామాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ ఎన్నో సంఘాలు నిర్మించి నిజాం రజాకార్ పోలీసులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు వీరోచిత పోరాటాలు చేశారన్నారు.వెట్టిచాకిరీ రద్దు చేయాలని,బానిసత్వం పోవాలని,దున్నేవాడికే భూమి వంటి నినాదాలతో అనేక కార్యక్రమాలతో ఊరువాడ ఉప్పెనలా ఉద్యమించారని గుర్తు చేశారు.వీరోచితంగా సాగిన ఆ మహత్తర పోరాటంలో 3,000 గ్రామాలు విముక్తి కాబడి,4500 మంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారని,10 లక్షల ప్రభుత్వ భూములను పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని వెంకటరెడ్డి తెలిపారు. కమ్యూనిస్టులు నిర్వహిస్తున్న సాయుధ పోరాటం మరింత ఉధృతమవుతున్న తరుణంలో నైజాం నవాబు ఆనాటి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేయడం జరిగిందన్నారు.బిజెపి నేతలు తెలంగాణ విమోచన దినమంటూ,కాంగ్రెస్ నేతలు సమైఖ్యత దినోత్సవమంటూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.అది ముమ్మాటికీ తెలంగాణ విలీన దినోత్సవమేనన్నారు.చరిత్రను వక్రీకరించే నాయకుల్లారా ఖబర్దార్ అని హెచ్చరించారు.